తెలుగు దినపత్రిక

సూర్యోదయ వార్త

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 23 | మంగళవారం 13.10. 2026 | పేజీలు :4 | వెల: 2

భూ మాఫియాకు, డ్రగ్స్ దందాకు బీజేపీ సర్కారు అండ

- ఆక్రమణలు, కబ్జాలతో గోవాలో భూములు అన్యాక్రాంతం
- డ్రగ్స్‌తో తప్పుదారి పడుతున్న రాష్ట్ర యువత
- ఈ పరిస్థితులన్నీ మారాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి
- గోవా సభలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ సూర్యోదయ వార్త

గోవాలో భూముల అన్యా క్రాంతం, డ్రగ్స్ దందాకు బీజేపీ ప్రభుత్వం అండగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆక్రమణలు, కబ్జాలతో భూములు అన్యాక్రాంతం అయ్యా యని, మరోవైపు డ్రగ్స్ వ్యాపారానికి బీజేపీ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇవ్వడంతో యువత తప్పుదారి పట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను సరిచేయా లంటే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు.తెలంగాణలో ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గోవాలో భూముల అన్యాక్రాంతం, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును పరిరక్షించాలనే లక్ష్యంతో గోవా కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'గోయ్ రాఖోన్స్' యాత్రలో భాగంగా ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం పాల్గొని ప్రసంగించారు.

అందుకే 'ప్రాపర్టీ సావంత్' అంటున్నారు..

'గోవా ప్రజలు బీజేపీ పాలనతో విసిగిపోయారు. మరోసారి ఆ పార్టీ అధికారంలోకి వస్తే స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోనే పరాయివారిగా మారే పరిస్థితి ఏర్పడు తుంది. రాహుల్ గాంధీ గోవాకు రావాల్సి ఉన్నప్పటికీ, ఢిల్లీలో నిరసన కార్య క్రమాల నేపథ్యంలో రాలేకపో యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రతినిధిగా నన్ను గోవాకు పంపించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ రాష్ట్రా న్ని అభివృద్ధి చేయకుండా ఆస్తులను ఇతరులకు అప్పగించే పనిలో ఉన్నారు.అందుకే ప్రజలు ఆయన్ను 'ప్రాపర్టీ సావంత్' అని పిలు స్తున్నారు. 'నషా ముక్త్ భారత్' గురించి మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గోవాలో ఈ సమస్యను ఎందుకు అరికట్టడం లేదు? అనేది ప్రజలు ఆలోచించుకోవాలి. గోవా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

'రావణుడు బీజేపీ అయితే, రాముడు కాంగ్రెస్. బీజేపీని ఓడించాలంటే ప్రజలంతా కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలి. గోవా ప్రజలు రెండుసార్లు బీజేపీని నమ్మి మోసపోయారు. మూడోసారి ఆ పార్టీని నమ్మొద్దు. గోవాలో కాంగ్రెస్‌కు కాకుండా ఇతర పార్టీలకు ఓటు వేసినా అది చివరకు బీజేపీకే ప్రయోజనం చేకూరుస్తుంది. జ్ఞానేశ్ కుమార్ పేరుతో పేదల ఓట్లను తొలగించే ప్రయ త్నం జరుగుతోంది. పేదలు, దళితులు, మైనారిటీలు, ఆది వాసీల ఓట్లను తొలగిస్తున్నారు. గోవాలో.. కాంగ్రెస్ పార్టీ కోసం కాదు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలి. దేశంలో నైరుతి రుతుపవనాలు తొలుత కేరళలో ప్రవేశించి, ఆ తర్వాత గోవాకు చేరు కుంటాయి. 2026 రుతుపవనాల సమయంలో కేరళంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 2027 రుతుపవనాల నాటికి గోవాలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుంది..' అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. గోవా నుంచి ఢిల్లీ ఎర్రకోట వరకు త్రివర్ణ పతాకం ఎగరడం ఖాయమని అన్నారు.





మంత్రి పొన్నం సవాల్‌కు నేను సిద్ధం రామచందర్ రావు

హైదరాబాద్ సూర్యోదయ వార్త

తెలంగాణలో ఎస్ఐఆర్ అంశంపై రాజకీయ వేడి పెరుగుతోంది. ఈసీ ఓట్లను తొలగిస్తోందని, ఓటు హక్కు కోల్పోయిన బాధితులను ఆధారాలతో సహా తీసుకొచ్చి చూపిస్తానంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ విసిరిన చాలెంజ్?ను బీజేపీ స్టేట్ ప్రిసిడెంట్ రామచందర్ రావు స్వీకరించారు. ఇవాళ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడిన ఆయన.. మంత్రి పొన్నం చాలెంజ్?కు నేను సిద్ధం అంటూ ప్రతి సవాల్ విసిరారు. ఓట్లు తొలగించబడ్డాయని చెబుతున్న కనీసం 10 మందినైనా ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలన్నారు. పొన్నం టైమ్ చెబితే నేను అక్కడికి వస్తానన్నారు. ఒక వేళ ఓటు డిలీట్ అయితే వెంటనే యాడ్ చేసే ప్రక్రియను ప్రారంబిద్దామన్నారు. నాకు తెలిసి మీరు మజ్లిస్ వారినే తీసుకువస్తారని అసదుద్దీన్, అక్బరుద్దీన్ ఒవైసీలను అయినా తీసుకురావచ్చన్నారు.

రైతులు ఇబ్బందులు పడుతుంటే మీరంతా ఢిల్లీకా

ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మంత్రులు, ఎమ్మెల్యేలందరూ స్పెషల్ ఫ్లైట్ లో ఢిల్లీకి వెళ్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు అంటే ఇంత నిర్లక్ష్యమా అని నిలదీశారు. రాహుల్ గాంధీ చేసే పిచ్చి పనులకు మీరంతా ఎందుకు అని నిలదీశారు. ఇక్కడ నీటి కరెంట్ కోతలు ఉన్నాయన్నారు.

ఫార్ములా ఈ కార్ రేసు.. కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్



హైదరాబాద్ సూర్యోదయ వార్త

నాంపల్లి ఏసీబీ కోర్టులో కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్ వేశారు. ఫార్ములా ఈ కార్ రేస్ లో ఏ1 గా చార్జ్‌షీట్‌లో తన పేరును తొలగించాలంటూ పేర్కొన్నారు. నిందితుల జాబితా నుండి తన పేరు తప్పించాలన్నారు. తాను అవినీతి చేసినట్లు ఏసీబీ అధికారులు నిరూపించలేకపోయారని కనుక ఈ కేసు నుండి తనను తప్పించాలని కోరుతూ కేటీఆర్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారణను నాంపల్లి కోర్టు విచారణను వచ్చే నెల కు వాయిదా వేసింది.కాదా ఇదివరకే ఫార్ములా ఈ కార్ రేసులో కేటీఆర్‌ను ఏసీబీ కోర్టు ఏ1 నిందితుడిగా చేర్చింది. ఈ కేసులో ఇప్పటికే కేటీఆర్ రెండు సార్లు కోర్టు విచారణకు హాజరయ్యారు.

30వ అంతస్తు నుంచి దూకి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

హైదరాబాద్ సూర్యోదయ వార్త

గచ్చిబౌలి పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. నానక్‌రామ్‌గూడలో భవనం 30వ అంతస్తు నుంచి భరత్(29) దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. భవనం కింద కారుపై పడిన భరత్‌ను సెక్యూరిటీ సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. భరత్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్ట్‌మెంటులో అద్దెకు దిగాడు. మృతుడి బంధువు కిశోర్ ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇండీ కూటమి మార్చ్ ఉద్రిక్తం

'చలో దిల్లీ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీలో పోలీసులకు కాంగ్రెస్ శ్రేణులకు మధ్యతోపులాట

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ముక్తకంఠం
- పిటిషన్ దాఖలు చేసిన రాహుల్‌గాంధీ
- దిల్లీలోని ఆరు కీలక మెట్రో స్టేషన్ల మూసివేత

హైదరాబాద్ సూర్యోదయ వార్త



సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ విపక్ష ఇండియా కూటమి దిల్లీలో చేపట్టిన 'చలో దిల్లీ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్ తదితర అగ్రనేతల నేతృత్వంలో వేలాది మంది కార్యకర్తలు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్ నుంచి సుప్రీంకోర్టు వైపు సాగిన ఈ నిరసన ప్రదర్శనను భగవాన్ దాస్ రోడ్డు వద్ద పోలీసులు భారీ బారికేడ్లతో అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, కాంగ్రెస్ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. కాంగ్రెస్ నేత కన్హయ్య కుమార్ ఏకంగా బారికేడ్ల పైకెక్కి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, దిల్లీ పోలీసులు కుమ్మక్కై యువతను అణచివేస్తున్నారని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులు, మహిళలపై ఉద్దేశపూర్వకంగానే దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరోవైపు, సీజేఐ సూచన మేరకు రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అధికారికంగా నమోదైంది. విపక్ష నేతలను నేరుగా కలిసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరాకరించారు. ఈ వ్యవహారం ఇప్పటికే న్యాయస్థానం పరిధిలో ఉన్నందున, అధికారికంగా పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. అంతకుముందు కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన నేతలు బస్సులో కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్ బయలుదేరారు. విపక్షాల నిరసనల దృష్ట్యా దిల్లీ పోలీసులు అప్రమత్తమ య్యారు. ర్యాలీ సాగే మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బారాఖంబా జంక్షన్ నుంచి మండి హౌస్ వరకు భద్రతా



బస్సుల్లో దసరా రద్దీ

- ప్రయాణికుల అవసరాలకు తగినట్లుగా అదనపు బస్సు సర్వీసులు
- ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి
- అధికారులకు టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి ఆదేశాలు
- తొలి 3 రోజుల్లోనే కోటి నలభై లక్షల మంది ప్రయాణం

హైదరాబాద్, వెలుతురు:

దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రవాణా సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) నడుపుతున్న ప్రత్యేక బస్సు సర్వీసులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దసరా పండుగ రద్దీ నిర్వహణ మరియు అదనపు బస్సుల ఆపరేషన్లపై టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి సోమవారం - మిగతా 2 లో..

రాహుల్ మతి లేకుండా మాట్లాడుతున్నారు..

హైదరాబాద్ సూర్యోదయ వార్త

ఎస్ఐఆర్ ప్రక్రియపై రాహుల్ గాంధీ మతిలేకుండా మాట్లాడుతు న్నారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఢిల్లీలో కాంగ్రెస్ నిరసనలు చేస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో (సోమవారం) ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రాజ్యాంగ సంస్థలపై రాహుల్ బ్లాక్ మెయిల్ చేస్తు న్నారన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మూకలను వెంట తీసుకొని సుప్రీం కోర్టుకు వెళ్లడం ఏమిటి?సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి క్లియర్‌గా వ్యక్తిగతంగా కలవలేను అని చెప్పారు.మూకలను వెంట వేసుకొని రాహుల్ సుప్రీంకోర్టు ముట్టడికి వెళ్తారా..! దేశంలో ఇప్పటికే ఎనిమిది సార్లు ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగింది. మర్చిపోయారా? అని అడిగారు. రాష్ట్రంలో నీరు, కరెంట్ లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే రేవంత్ సర్కార్ గాలికి వదిలేసిందని. ఒకప్పుడు కాంగ్రెస్ దేశంలో దొంగ ఓట్లు ఉన్నాయని



ఆర్టీసీ -మెట్రో కామన్ పాస్ ఛార్జీల పునఃపరిశీలన

- ప్రజల ఫిర్యాదుల నేపథ్యంలో ఛార్జీల సమీక్షకు ప్రభుత్వం నిర్ణయం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం

2

తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

విద్యుత్ కోతలపై సబ్ స్టేషన్ల ముట్టడికి. బడే నాగజ్యోతి పిలుపు...

- కరెంట్ కోతలతో రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగాములుగు నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనలు..
- ఈనెల అక్టోబర్ 14 బుధవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో ఉన్న సబ్ స్టేషన్ల ముట్టడికి సిద్ధం కావాలి..

ములుగు బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి. బడే నాగజ్యోతి..

ములుగు. అక్టోబర్ 12(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



ములుగు నియోజకవర్గం: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కనీసం 6 గంటల పాటు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయలేక ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి. విమర్శించారు.రైతులకు నిరంతర విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందని, విద్యుత్ కోతల కారణంగా పంటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశామని చెప్పుకునే గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు,24గంటల నాణ్యతమైన విద్యుత్ సరఫరాను అందించాలని డిమాండ్ చేస్తూ ములుగు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ముట్టడి, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు..తాజా మాజీ మండల పార్టీ అధ్యక్షులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు సమన్వయంతో ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొని రైతుల హక్కుల కోసం గళమెత్తాలని నాగజ్యోతి కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు...


మంత్రి సీతక్క విజ్ఞప్తికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం..

- ములుగు నియోజకవర్గంలో విద్యుత్ లైన్ల మార్పునకు రూ.3 కోట్ల నిధులు మంజూరు..
- మంత్రి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క..

- ఉత్తర్వులు జారీ చేసిన విద్యుత్ శాఖ..

ములుగు. అక్టోబర్ 12(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)





GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Energy Department – TG NPDCL – Extension and Shifting of Lines passing over houses in the Mulugu constituency with an estimated amount of Rs.3 Crores – Approval – Orders – Issued.

ENERGY (POWER.I) DEPARTMENT

G.O.Rt.No.32 Dated.08.10.2026
Read the following:-

1. From the Hon'ble Minister for PR, RD & RWS, Women & Child Welfare & SC Department, Lr.No.560/M(PR&RD, RWS, W&CW)/ MLC/2025/ 2025, Dated. 01.03.2025 through the Hon'ble Deputy Chief Minister (E) vide Endt.No.58/Dy.CM(F&P,E)/2025, Dated. 04.03.2025.
2. Letter from CMD, TG NPDCL, Lr.No.TGNPDCL/CMD/CE(OP-II)/DE(O&M-II), D.No.3680/25-26, dated 09.03.2026.

ORDER:-

In the circumstances reported by the CMD, TGNPDCL in the reference 2nd read above and after careful examination, the Government here by accord approval for extension and shifting of Lines passing over houses in the Mulugu constituency, with an estimated amount of Rs.3 Crores.

2. The expenditure sanctioned in Para-1 above shall meet from the following head of Accounts.

Sl.No.	Name of the Scheme	Head of Account
1		2801-05-800-25-23-310-312
2	Assistance to TRANSCO	2801-05-789-25-23-310-312
3		2801-05-796-25-23-310-312

3. The Chairman & Managing Director, TG NPDCL shall take further necessary action accordingly.

4. This order issues with the concurrence of Finance (EBS.II) Department vide their U.O.No. 4116856/269/A2/EBS.II/2026, Dated:05.10.2026.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

NAVIN MITTAL
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT

To
The Chairman & Managing Director, TGNPDCL, Warangal.
The Pay and Accounts Officer, Hyderabad.
The Accountant General (A&E), Telangana, Hyderabad.
Copy to:
P.S to Hon'ble Minister for PR, RD & RWS, Women & Child Welfare & SC Department.
OSD to Hon'ble Deputy C.M. (Energy).
P.S. to Special Chief Secretary to Government, Energy Department.
The Finance (EBS.II) Department.
The Energy (OP/ BUDGET) Department
File.C.No.452/Power.I/2025.
Computer.No.993572.
SC/SF.

ములుగు నియోజకవర్గ ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి సీతక్క చేసిన విజ్ఞప్తికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. నివాస ప్రాంతాల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లను మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.3 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ మేరకు విద్యుత్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.నివాస ప్రాంతాల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడం వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, భద్రతాపరమైన సమస్యలను మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రమాదాల ముప్పును తగ్గించేలా విద్యుత్ లైన్లను మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకో వాలని కోరారు.మంత్రి సీతక్క విజ్ఞప్తిపై ఉప ముఖ్య మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్ర మార్క సాను కూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ములుగు నియోజకవర్గంలో విద్యుత్ లైన్ల మార్పునకు రూ.3 కోట్ల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి సీతక్క చొరవతో ములుగు నియోజకవర్గ ప్రజలకు ప్రయోజనం చేకూర నుంది. విద్యుత్ లైన్ల మార్పు పనులు పూర్తయితే నివాస ప్రాంతాల్లో ప్రజలకు భద్రత పెరగడంతో పాటు, విద్యుత్ లైన్ల కారణంగా ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోనున్నాయి. సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషిచేసిన మంత్రి సీతక్కకు ఈ సందర్భంగా ములుగు నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు...

సుజాతనగర్ ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయించాలని కమిషనర్‌కు వినతి

సుజాతనగర్ ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయింపుపై కమిషనర్ సానుకూల సుజాత స్పందన.



సుజాత నగర్ సూర్యోదయ వార్త అక్టోబర్ 12 :

సుజాతనగర్ ప్రెస్ క్లబ్ కు స్థలం కేటాయించాలని కోరుతూ అధ్యక్షుడు చల్లగుండ్ల నరేష్ కుమార్, క్లబ్ సభ్యులు తహసీల్దార్ కు, ఎంపీడీఓ కు, 21వ డివిజన్ కార్పొరేటర్ కు వినతిపత్రం అందజేశారు.సోమవారం కొత్తగూడెంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత కి వినతిపత్రం అందజేశారు.అనంతరం కమిషనర్ వినతిని స్వీకరించి సానుకూలంగా స్పందించారు.సుజాత నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చల్లగుండ్ల నరేష్ కుమార్ మాట్లాడుతూ ఈ షెడ్ చాలా రోజులుగా నిరుపయోగంగా ఉందని, దీనిని ప్రెస్ క్లబ్ కార్యాలయంగా వినియోగిస్తే పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సమస్యలు, ప్రజా సమస్యలపై చర్చించడానికి, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం పక్కన ఖాళీగా ఉన్న పాత పంప్ షెడ్ ను పరిశీలించి, నియమానుసారంగా ప్రెస్ క్లబ్ కు కేటాయించేందుకు కమిషన్ లో కార్పొరేటర్ ల అందరి ఆమోదం వచ్చాక,చర్యలు తీసుకుంటామని కమీషనర్ సుజాత హామీ ఇచ్చారు. ఈ వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించడంతో ప్రెస్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చల్లగుండ్ల నరేష్ కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉబ్బనపల్లి ప్రసాద్, రహీం, కత్తి బాలకృష్ణ, సుదీర్, వెంకటేష్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

లింగాల గ్రామపంచాయతీ పరిధిలో నూతన సిసి రోడ్ల పనులు ప్రారంభం

- గ్రామపంచాయతీ పరిధిలో 50 లక్షల రూపాయలతో పది సిసి రోడ్లు మంజూరు..
- సీసీ రోడ్ల పనులను ప్రారంభించిన తాడ్వాయి మండల అధ్యక్షులు. మంకిడి నరసింహస్వామి. లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్. మొగిలిపల్లి రవీందర్...

తాడ్వాయి. ములుగు జిల్లా. అక్టోబర్ 12(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)







ములుగు జిల్లా తాడ్వాయి మండలం లింగాల గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైనా 10 సీసీ రోడ్లు పనుల ను తాడ్వాయి మండలం అధ్యక్షులు మంకిడి నర్సింహా స్వామి. లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ నూతన సిసి రోడ్ల పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్. శ్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి. ధనసరి అనసూయ సీతక్క ఆదేశాలతో , జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచన ప్రకారం తాడ్వాయి కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు మంకిడి నర్సింహా స్వామి ఆధ్వర్యంలో లింగాల గ్రామ పంచాయతీకి 50 లక్షలు రూపాయల 10 సీసీ రోడ్లు మంజూరు చేయడం జరిగింది.. లింగాల, బోటి లింగాల, కొడిశల గ్రామ పంచాయతి పక్షాన మంత్రివర్యులు సీతక్కకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపిన సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ ...ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండలం అధ్యక్షులు మంకిడి నర్సింహా స్వామి,లింగాల సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్,వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్రకోళ్ల తిరుపతి, ఎస్టి సెల్ అధ్యక్షులు మంకిడి ప్రశాంత్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చెన్నూరి సతీష్, మాజీ సర్పంచ్ ఊకె మౌనిక, మాజీ ఎంపీటీసీ ఊకె రాజు, వార్డ్ మెంబెర్ చాపల సురేష్, ఊకె కృష్ణ, చెన్నూరి నర్సయ్య, బీపీఎం నాగేశ్వరావు × ఐటిడిఏ ఏ ఈ.రాము , గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు...

గాయత్రీ దేవి అవతారంలో దుర్గామాత

ఘనంగా శ్రీ దుర్గ శరన్నవరాత్రి ఉత్సవాలు..

మంగపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 12(సూర్యోదయ వార్త.. ములుగు ప్రతినిధి)





ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని బోర్ నరసాపురం గ్రామ సమీపంలో గౌరారం వాగు ఒడ్డున స్వయంభుగా వెలసిన శ్రీ కనక దుర్గమ్మ తల్లి ఆలయంలో శ్రీ దుర్గ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గౌరారం వాగు ఒడ్డున ఉన్నటువంటి శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో గత మూడు సంవత్సరాల నుండి శరన్న వరాత్రి ఉత్సవాలు ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రెండవ సోమవారం రోజు గాయత్రి దేవి అవతా రంలో భక్తులకు దర్శనమిస్తున్నది. ఉదయం 7 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహి ంచగా. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ మ్మవారిని దర్శించుకొని ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా 13 మంది భవాని భక్తులు మాల ధారణ చేశారు. శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆలయ పూజారి– మాను పెల్లి వేణు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో 13 మంది మాల ధారణ ధరించిన భక్తులు సహకారంతో ఈ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి మాను పెల్లి వేణు తెలిపారు. ఆలయ నిర్వాహకులు – ఆలయ పూజారి . మానుపల్లి వేణు. స్వామి. పల్లపు హరీష్. విగ్రహ దాత జనగం నిద్య భవాని స్వాములు. కుంజా సురేష్. నాగచైతన్య. చంద్రశేఖర్. రోహిత్. శివకుమార్. కీర్తి. ధనలక్ష్మి. దుర్గ. జంపన్న. ఆలయ కమిటీ లో ఉన్నారు...

గృహ హింస నుంచి మహిళల రక్షణ చట్టం..!

- 2005 అమలుపై ఢిల్లీలో జాతీయ స్థాయి సమావేశం..
- ములుగు జిల్లాలో చట్టం అమలు తీరును వివరించిన జిల్లా సంక్షేమ అధికారి - ఈ.పీ. ప్రేమలత..

ములుగు. అక్టోబర్ 12(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)





గృహ హింస నుంచి మహిళలకు రక్షణ కల్పించడం, బాధిత మహిళలకు చట్టపరమైన సహాయం అందించడం, వారి హక్కులను పరిరక్షించడం, గృహ హింస నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టడం లక్ష్యంగా రూపొందించిన మహిళలను గృహ హింస నుంచి రక్షణ చట్టం, 2005 (ప్రొటెక్షన్ అఫ్ ఉమెన్స్ ఫ్రొం డోమెస్టిక్ విఓలెన్స్ యాక్ట్ , 2005) అమలుపై దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలు, అమలు తీరును సమీక్షించేందుకు జిల్లా స్థాయిలో ఉమెన్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు గా వ్యవహరిస్తున్న జిల్లా సంక్షేమ అధికారుల (డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్స్) కు ఢిల్లీలో జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది.ఈ జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ లో ములుగు జిల్లా నుంచి జిల్లా సంక్షేమ అధికారి ఈ.పీ. ప్రేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పేరుతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వినూత్న కార్యక్రమాల ద్వారా ములుగు జిల్లాలో జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ఉన్న అన్ని ప్రభుత్వ యంత్రాంగాలను ఒక్క చోటుకి చేర్చి గ్రామ స్థాయిలో ములుగు జిల్లాలో గృహ హింస బాధిత మహిళలకు రక్షణ కల్పించేందుకు సంబంధిత అధికారుల ద్వారా చేపట్టిన చర్యలు, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించడం, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవడం వంటి అంశాలను వివరించారు. గృహ హింసకు గురైన మహిళలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వారికి అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణ వ్యవస్థలు, సహాయ సేవల గురించి సమాచారం అందించడం పై వారికి సంపూర్ణ అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.గృహ హింస అనేది మహిళల శారీరక, మానసిక, ఆర్థిక, భావోద్వేగ భద్రతపై ప్రభావం చూపే తీవ్రమైన సామాజిక సమస్య అని, బాధిత మహిళలకు సకాలంలో రక్షణ, న్యాయం, అవసరమైన సహాయం అందించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చని కావున మహిళలు తమపై జరుగుతున్న హింసను మౌనంగా భరించకుండా, చట్టం కల్పించిన హక్కులను వినియోగించుకోవాలని, సంబంధిత అధికారులను సంప్రదించి తగిన సహాయం పొందాలని అవగాహన కల్పించడం అవసరమని తెలిపారు.జాతీయ స్థాయి సమావేశంలో వివిధ జిల్లాల్లో చట్టం అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, బాధిత మహిళలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు అనుసరించాల్సిన విధానాలు, అధికారుల బాధ్యతలు, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు.మహిళల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గృహ హింస రహిత సమాజ నిర్మాణం కోసం సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ములుగు జిల్లాలో మహిళల రక్షణ, సాధికారత దిశగా చేపడుతున్న చర్యలను జాతీయ స్థాయి వేదికపై వివరించడం ద్వారా జిల్లాలో గృహ హింస నుంచి మహిళలకు రక్షణ కల్పించేందుకు జరుగుతున్న కృషిని తెలియజేశారు....

అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకోం..!

చాద మల్లయ్య వైఖరిపై మండిపడ్డ 'తుడుందెబ్బ' నేతలు..

మంగపేట, ములుగు జిల్లా అక్టోబర్ 12 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి.)



ములుగు జిల్లా మంగపేట మండలంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పూనెం ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తుడుందెబ్బ ములుగు జిల్లా అధ్యక్షులు నల్లెబోయిన లక్ష్మణ్ దొర, విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కబ్బాక లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఆదివాసి నాయకపోడు సేవా సంఘం మండల సమావేశంలో చాద మల్లయ్యపై జరిగిన దాడి ఘటనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని మండిపడ్డారు. చదా మల్లయ్యకు రాజ్యాంగం, చట్టాల పట్ల అవగాహన లేదంటూ మాట్లాడడం సరికాదని, అలాంటి వారికి పెద్ద పదవులు ఎలా ఇస్తారంటూ ఆదివాసి హక్కుల పోరాట సమితి తీవ్రంగా ఖండించింది.?"ఎవరు ఎవరి ఇంటికి వెళ్లి దాడి చేశారు? ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లి దాడికి పాల్పడ్డారు. చదా మల్లయ్య ఆత్మవిమర్శ చేసుకోవాలి. అసత్యపు ఆరోపణలు చేస్తే సంఘాల తరఫున ఊరుకోబోం" అని హెచ్చరించారు. నాయకపోడు తెగ ఎస్టీ కాదనే ప్రచారం అవాస్తవమని, జాబితాలోని 33 తెగలకు ఎవరి సంస్కృతి, సంప్రదాయాలు వారికి ప్రత్యేకంగా ఉంటాయని, ప్రతి ఒక్కరి సంప్రదాయం గొప్పదేనని స్పష్టం చేశారు. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం, రెండు సంఘాల సమన్వయంతో పనిచేస్తున్న వర్గాల మధ్య వైరాన్ని సృష్టించడం సమంజసం కాదని అన్నారు. తక్షణమే తన వైఖరి మార్చుకోవాలని ఆదివాసి సంఘాల తరఫున విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు పోడెం నాగేశ్వరరావు, తుడుందెబ్బ జిల్లా మీడియా ఇన్‌చార్జి ఎట్టి సారయ్య దొర, మండల కార్యదర్శి ఈసాల భాగ్యరాజ్, మారబోయిన గోవర్ధన్, కొమరం లక్ష్మీపతి, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సం రమేష్, కొమరం బాలయ్య, ములుగు జిల్లా మార్కెట్ డైరెక్టర్ కొమరం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు...

అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకోం..!

చాద మల్లయ్య వైఖరిపై మండిపడ్డ 'తుడుందెబ్బ' నేతలు..



మంగపేట, ములుగు జిల్లా అక్టోబర్ 12 సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి.)

ములుగు జిల్లా మంగపేట మండలంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పూనెం ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తుడుందెబ్బ ములుగు జిల్లా అధ్యక్షులు నల్లెబోయిన లక్ష్మణ్ దొర, విద్యార్థి సంఘం (ఏఎస్ యూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కబ్బాక లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఆదివాసి నాయకపోడు సేవా సంఘం మండల సమావేశంలో చాద మల్లయ్యపై జరిగిన దాడి ఘటనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని మండిపడ్డారు. చదా మల్లయ్యకు రాజ్యాంగం, చట్టాల పట్ల అవగాహన లేదంటూ మాట్లాడడం సరికాదని, అలాంటి వారికి పెద్ద పదవులు ఎలా ఇస్తారంటూ ఆదివాసి హక్కుల పోరాట సమితి తీవ్రంగా ఖండించింది.?"ఎవరు ఎవరి ఇంటికి వెళ్లి దాడి చేశారు? ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లి దాడికి పాల్పడ్డారు. చదా మల్లయ్య ఆత్మవిమర్శ చేసుకోవాలి. అసత్యపు ఆరోపణలు చేస్తే సంఘాల తరపున ఊరుకోబోం" అని హెచ్చరించారు. నాయకపోడు తెగ ఎస్టీ కాదనే ప్రచారం అవాస్తవమని, జాబితాలోని 33 తెగలకు ఎవరి సంస్కృతి, సంప్రదాయాలు వారికి ప్రత్యేకంగా ఉంటాయని, ప్రతి ఒక్కరి సంప్రదాయం గొప్పదేనని స్పష్టం చేశారు. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం, రెండు సంఘాల సమన్వయంతో పనిచేస్తున్న వర్గాల మధ్య వైరాన్ని సృష్టించడం సమంజసం కాదని అన్నారు. తక్షణమే తన వైఖరి మార్చుకోవాలని ఆదివాసి సంఘాల తరపున విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు పోదేం నాగేశ్వరరావు, తుడుందెబ్బ జిల్లా మీడియా ఇన్చార్జి ఎట్టి సారయ్య దొర, మండల కార్యదర్శి ఈసాల భాగ్యరాజ్, మారబోయిన గోవర్ధన్, కొమరం లక్ష్మీపతి, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సం రమేష్, కొమరం బాలయ్య, ములుగు జిల్లా మార్కెట్ డైరెక్టర్ కొమరం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు...

రాష్ట్ర అథ్లెటిక్స్‌లో ములుగు రన్న రప్..!



ములుగు. అక్టోబర్ 12(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఈనెల అక్టోబర్ 11 న జరిగిన రాష్ట్ర స్థాయి అట్లాటిక్స్ పోటీల్లో ములుగు జిల్లా క్రీడాకారులు.9 మెడల్స్. 31 పాయింట్లతో ఓవరాల్ రన్న రప్ గా నిలిచారు. 4 బంగారు.03 వెండి 02. రజిత పత కాలు సాధించారు. లాంగ్ జంప్ లో శివకుమార్ కిడ్స్ జావలిన్ త్రో కౌశిక్. టాథలిన్ గ్రూప్. ఏ లో గోల్డ్ సాధించారు. క్రీడాకారులు. కోచ్ లను మంత్రి సీతక్క అభినందించారు..

దసరా ఉత్సవాలకు బీఆర్ఎస్ నేతల ఆర్థిక చేయూత..

- ఉత్సవ కమిటీకి రూ.80 వేల విరాళం..
- రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, సర్పంచ్ కాకులమర్రి శ్రీలత...



ఏటూరునాగారం, అక్టోబర్ 12(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

పవిత్ర దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో రహదారుల మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సర్పంచ్ కాకులమర్రి శ్రీలత ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పనులను ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పండుగ సందర్భంగా భక్తులు, ప్రజలు, వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రహదారులపై ఉన్న గుంతలను పూడ్చివేసి, మరమ్మతు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. దసరా ఉత్సవాలు వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించాలని తెలిపారు. దసరా ఉత్సవాల నిర్వహణకు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తుమ్మ మల్లారెడ్డికి రూ.50,000 విరాళంగా ప్రకటించి అందజేశారు. అదేవిధంగా ఆయన సోదరుడు కాకులమర్రి ప్రదీప్ రావు రూ.30,000 ఆర్థిక సాయాన్ని ఉత్సవ కమిటీకి అందించారు. దీంతో మొత్తం రూ.80,000 విరాళం అందించి దసరా ఉత్సవాల నిర్వహణకు తమ వంతు తోడ్పాటును అందించారు. పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు, కాకులమర్రి ప్రదీప్ రావులను ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఒకవైపు పండుగ ఏర్పాట్లు, మరోవైపు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారుల మరమ్మతులపై దృష్టి సారించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, కూనూరు అశోక్ గౌడ్, తాడూరి రఘు, సప్పిడి రామ్ నర్సయ్య, ఎండీ ఖాజా పాషా, కర్ర రవీందర్, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ దన్నపునేని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాలెం ప్రాజెక్టు ప్రధాన కాలువపై నిర్మించిన బ్రిడ్జికి రంధ్రాలు.!

- వృధాగా పోతున్న సాగునీరు... ఇప్పటివరకు సాగునీటిని విడుదల చేయలేదు అని అంటున్న స్థానికులు..
- పట్టించుకోని అధికారులు..
- పంటలు ఎండిపోయాక మరమ్మత్తులు చేయిస్తారా ..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు...
- తక్షణమే కాలువకు మరమ్మతులు చేపట్టి వృధాగా పోతున్న నీటిని అరికట్టాలి



వెంకటాపురం. నూగూరు. అక్టోబర్ 12(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా వెంకటాపురం మండలం బర్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చిన గంగారం గ్రామ సమీపంలో పాలెం ప్రాజెక్టు ప్రధాన కాలువ పై నిర్మించిన బ్రిడ్జి కి రంధ్రాలబడి సాగు నీరు వృధాగా పోతుంది. బర్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చుట్టుపక్కల గ్రామాలు. మహితా పురం. ఒంటిమామిడి బర్లగూడెం. చినగంగారం. చిరు తపల్లి. రామవరం. పర్శిక గూడెం. పలు గ్రామాలు లో సుమారు 200 నుండి 300 ఎకరాల భూ విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు పండిస్తుంటారు రైతులు. ప్రధాన కాలువ పై నిర్మించిన బ్రిడ్జికి గండి పడటం వల్ల ప్రాజెక్ట్ నుండి విడుదలైన నీరు రంధ్రాలు పడిన చోట సాగునీరు వృధాగా పోతుంది. దీనివల్ల రైతులు తీవ్ర నష్టపోతున్నారని పంటలు ఎండిపోయాక ప్రధాన కాలువ పై ఉన్న బ్రిడ్జి కి మరమ్మత్తులు చేయిస్తారా అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధిక ారులకు ప్రజావాణిలో వినతులు సమర్పించిన పట్టించుకోవడం లేదు అంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృధాగా పోతున్న సాగునీటిని అరికట్టి ప్రధాన కాలువ ద్వారా వచ్చే నీటిని రైతులకు అందే విధంగా చూడాలని రైతుల కోరుతున్నారు..



సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న రైతులు..



పాలెం ప్రాజెక్టు ప్రధాన కాలువకు పడిన రంధ్రాలను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించి రైతులకు సాగునీరు అందించే విధంగా అధికారుల చర్యలు తీసుకోవాలి...

- తాటి లక్ష్మణరావు. చిన గంగారం గ్రామస్తుడు..

ఇప్పటివరకు పాలెం ప్రాజెక్టు ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయకపోవడంపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు.. ప్రధాన కాలువపై ఉన్న బ్రిడ్జి లకు మరమ్మతులు చేయిస్తే నీటిని అరికట్టవచ్చు అని రైతులు అన్నారు.

నిరంతర ఒత్తిళ్ల నుంచి కాస్త విరామం...ఆహ్లాదం

- ప్రజలు, చిన్నారులకోసమే వినోద వేదికల ఏర్పాటు
- లక్ష్మీదేవిపల్లిలో బాబా ట్రేడ్ ఫేర్స్ ఎగ్జిబిషన్'ను ప్రారంభించిన సాబీర్ పాషా

లక్ష్మీదేవిపల్లి (సూర్యోదయ వార్త)

రోజువారీ యాంత్రిక జీవనం, నిరంతర పని ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు ఆహ్లాదకరమైన వినోద వేదికలు ఎంతో అవసరమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. దసరా, దీపావళి తదితర పండుగల సీజన్ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలో బాబా ట్రేడ్ ఫేర్స్ పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన బాహుబలి 'ఎగ్జిబిషన్'ను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపేందుకు, చిన్నారులకు చక్కని ఆటవిడుపును అందించేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. పట్టణ, గ్రామీణ ప్రజలు ఒకే చోట వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేయడంతో పాటు మంచి వినోదాన్ని పొందేందుకు ఇది చక్కటి అవకాశమని పేర్కొన్నారు. మొత్తం 45 రోజుల పాటు కొనసాగే ఈ ప్రదర్శనను ప్రజలు, చిన్నారులు వినియోగించుకుని మానసిక ఉల్లాసాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోర్స వీరబాబు, పడిగ రాంబాబు, కళ్యాణి, లక్ష్మినర్సు, కనకరాజు, అజ్మీరా లైలా, బానోత్ రాణి, స్థానిక ఎస్సై అఖిల, ఎగ్జిబిషన్ నిర్వాహకులు షఫి, రమణ, సాయి తదితరులు పాల్గొన్నారు.





గిరిజన దర్బార్‌లో 7 దరఖాస్తులు స్వీకరించిన ఐటీడీఏ పీఓ!

- ఉద్యోగాలు, భూ ఆక్రమణలు, దుకాణాల కేటాయింపులపై వినతులు..
- సమస్యల పరిష్కారానికి అధికారులకు పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశాలు..

ఏటూరునాగారం, అక్టోబర్ 12:(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

గిరిజన ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ప్రజల నుంచి ఏడు దరఖాస్తులు స్వీకరించారు. వివిధ సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ దర్బార్‌లో ఉద్యోగాలు, బదిలీలు, గిరిజన భూముల ఆక్రమణలు, దుకాణాల కేటాయింపులు, అదనంగా వసూలు చేసిన మొత్తాల తిరిగి చెల్లింపు, ఏజెన్సీ ధ్రువపత్రాల మంజూరు తదితర సమస్యలపై ప్రజలు వినతులు



సమర్పించారు. మహబూబాబాద్ ప్రాంతీయ విద్యాశాఖ అధికారికి సంబంధించి మూడు దరఖాస్తులు అందగా, మంగపేట మండలం అఖినేపల్లి మల్లారం ప్రాంతంలో గిరిజన, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, భూముల బదలాయింపులు, పేర్ల మార్పిడులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని మరో దరఖాస్తు అందింది. అలాగే పస్రా గ్రామపంచాయతీ పరిధిలోని 18 గదుల అంగడిపేట దుకాణ సముదాయాన్ని ఐటీడీఏ పరిధిలోకి తీసుకురావాలని, మరో 13 గదుల దుకాణ సముదాయంలో గిరిజనులకు దుకాణాల కేటాయింపు సందర్భంగా ముందస్తు జమకు అదనంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించాలని వినతులు అందాయి. మంగపేట మండలంలోని ఆదివాసీ విద్యార్థులకు సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏజెన్సీ ధ్రువపత్రాలు మంజూరు చేయాలని కోరుతూ మరో దరఖాస్తు సమర్పించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా, వాటి స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులు విచారణ చేపట్టి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జి.ప్రతాప్, డీడీ జనార్ధన్, కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రవీణ, పరిపాలన అధికారి ఏ.అనిల్ కుమార్, ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె.క్రాంతి కుమార్, ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పద్మిని తదితర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ఏటూరునాగారం అమ్మాయిల అద్భుత ప్రతిభ..!

- మూడు పతకాలతో సత్తా చాటిన క్రీడాకారిణులు!
- స్వర్ణం.. రజతం.. కాంస్యం.. అథ్లెటిక్స్‌లో ఏటూరునాగారం విజయభేరి..
- తెలంగాణ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఏటూరునాగారం సెంటర్‌కు అరుదైన ఘనత..
- మూడు పతకాలతో మెరిసిన క్రీడా ఆణిముత్యాలు!..
- విజేతలకు జిల్లా కాంగ్రెస్ నాయకుల అభినందనలు!

ఏటూరునాగారం, అక్టోబర్ 12:(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– 12వ తెలంగాణ రాష్ట్ర సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్--2026లో ములుగు జిల్లా ఏటూరునాగారం అథ్లెటిక్స్ సెంటర్ క్రీడాకారిణులు అద్భుత ప్రతిభ కనబరిచి మూడు పతకాలు సాధించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ క్రీడా నైపుణ్యాన్ని చాటుతూ ఏటూరునాగారం ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీల్లో టి.అక్షర ట్రయాథ్లాన్–ఏ విభాగంలో స్వర్ణ పతకం సాధించగా, బి.హర్షిణి లాంగ్‌జంప్‌లో



రజత పతకం, బి.హర్షిత ట్రయాథ్లాన్–బి విభాగంలో కాంస్య పతకం సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ముగ్గురు క్రీడాకారిణులు పతకాలు సాధించడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, రాష్ట్ర రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, డాక్టర్ వర ప్రసాద్ రావు, కావిరి అర్జున్ విజేతలను అభినందించారు. క్రీడాకారిణులు సాధించిన విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఏటూరునాగారం పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణులకు శిక్షణ అందించిన కోచ్‌లు పి. కుమారస్వామి, కె. భావన కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...



రొమాంటిక్ రైడ్‌కు రంగం సిద్ధం..

ఇమ్రాన్ ఖాన్‌తో రొమాన్స్ చేయబోతున్న భూమి పెడ్నేకర్!

బాలీవుడ్‌లో విలక్షణమైన పాత్రలు ఎంచుకుంటూ, తన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి భూమి పెడ్నేకర్. డిఫరెంట్ కాన్సెప్ట్ సినిమాలు చేస్తూ ప్రశంసలు అందుకున్న ఈ టాలెంటెడ్ బ్యూటీ.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. ఇమ్రాన్ ఖాన్ గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్న క్రేజీ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'అధురే హమ్ అధురే తుమ్' చిత్రంలో భూమి పెడ్నేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సమాచారం. 'కభీ కభీ అదితి జిందగీ మే..' పాటతో మిల్లీనియల్స్ మనసు దోచుకున్న ఇమ్రాన్ ఖాన్ చాలా కాలం తర్వాత మెయిన్ లీడ్ రోల్‌లో కనిపిస్తుండగా.. భూమి పెడ్నేకర్ పెర్ఫార్మెన్స్, ఆమె క్యారెక్టర్ ఈ సినిమాకు మెయిన్ హైలైట్‌గా నిలవనుందని తెలుస్తోంది. వైవిధ్యమైన స్క్రిప్టులు ఎంచుకోవడంలో పేరుగాంచిన భూమి, ఇమ్రాన్ కాంబినేషన్ తెరపై కొత్త మ్యాజిక్ క్రియేట్ చేయబోతోందని టాక్ నడుస్తోంది. ఈ చిత్రంలో గూర్ఖతేహా పీర్జాద కీలక పాత్రలో కనిపిస్తుండగా, ఫేమ్ దానిష్ అస్లామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్‌లో వచ్చిన 'హ్యాపీ పటేల్: ఖతర్నాక్ జసూస్' సినిమాలో చిన్న క్యామియో చేసిన ఇమ్రాన్.. ఇప్పుడు భూమి పెడ్నేకర్‌తో కలిసి చేయబోతున్న ఈ చిత్రం డిసెంబర్ 18న నేరుగా ఓటీటీ వేదికగా విడుదల కాబోతున్నట్లు సమాచారం.

ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ 'డ్రాగన్'
షూటింగ్‌పై క్రేజీ అప్‌డేట్..

నవంబర్ నుంచి కొత్త షెడ్యూల్ షురూ!




టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ అయిన 'డ్రాగన్' మూవీ కోసం యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించి చిత్ర యూనిట్ నుంచి ఒక ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. గాయం నుంచి కోలుకుంటున్న తారక్ త్వరలోనే మళ్లీ సెట్స్‌లోకి అడుగుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

హైదరాబాద్‌లోని ప్రముఖ అల్యూమినియం ఫ్యాక్టరీలో ఈ చిత్రం కోసం ఒక భారీ సెట్‌ను ఇప్పటికే నిర్మించారు. నవంబర్ మొదటి వారం నుంచి ఈ సెట్‌లో 'డ్రాగన్' కొత్త షెడ్యూల్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌తో పాటు చిత్రంలోని ఇతర ప్రధాన తారాగణంపై కొన్ని కీలకమైన, ఉత్కంఠభరితమైన సన్నివేశాలను తెరకెక్కించనున్నారు.

ఇదిలా ఉంటే, ప్రశాంత్ నీల్ సినిమాలలో ఇప్పటివరకు విజువల్స్ అన్నీ ప్రధానంగా డార్క్, బ్లాక్ అండ్ గ్రే షేడ్స్‌లో ఉండటం తెలిసిందే. అయితే, ఎన్టీఆర్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మాత్రం ఒక ప్రత్యేకత ఉండబోతోందని టాక్. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ పూర్తిగా కలర్‌ఫుల్‌గా, సరికొత్త విజువల్ వండర్‌లా సాగుతాయని ప్రచారం జరుగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, రాక్ స్టార్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. తారక్ కెరీర్‌లో మరో సరికొత్త మైలురాయిగా నిలవబోతున్న ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకూ తారాస్థాయికి చేరుకుంటున్నాయి.

విజయ్ దేవరకొండ ఫ్యాన్స్‌కు బిగ్ షాక్..

'రణబాలి' డబ్బింగ్ వెర్షన్స్ విడుదల వాయిదా!



టాలీవుడ్ సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రణబాలి' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పెళ్లి తర్వాత ఈ క్రేజీ కాంబో తెరపైకి వస్తుండటం, అటు 'టాక్సీవాలా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రాహుల్ సాంకృత్యాన్ -- విజయ్ కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే అనుకున్న తేదీ ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 16న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది.

అయితే, ఓవర్సీస్ మార్కెట్లోని ప్రేక్షకులకు, ముఖ్యంగా నాన్-తెలుగు విజయ్ ఫ్యాన్స్‌కు మేకర్స్ నుంచి నిరాశ కలిగించే అప్‌డేట్ అందింది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ల సమాచారం ప్రకారం.. అక్టోబర్ 16న విడుదల రోజున విదేశాల్లో కేవలం ఒరిజినల్ తెలుగు వెర్షన్ మాత్రమే ప్రదర్శించబడుతుంది. ఇతర భాషల డబ్బింగ్ వెర్షన్‌లకు సంబంధించిన కంటెంట్ సిద్ధం చేయడంలో ఏర్పడిన ఆలస్యం కారణంగా, వాటి రిలీజ్‌ను అక్టోబర్ 23కి వాయిదా వేశారు.

మరోవైపు, ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమాకు సంబంధించి అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ థియేటర్ చైన్‌లలో ఇప్పటికే టిక్కెట్ల అమ్మకాలు ప్రారంభం కాగా, కేవలం ప్రీ-సేల్స్ ద్వారానే సినిమా 50 వేల డాలర్ల మార్కును దాటడం విశేషం. రాబోయే రోజుల్లో ప్రీమియర్ కలెక్షన్స్ ఏ స్థాయిలో ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ అద్భుతమైన బాణీలు అందిస్తున్న ఈ భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

రామోజీ ఫిల్మ్‌సిటీలో 'జార్జ్ క్రిష్'
ఊరమాస్ షూటింగ్!



టాలీవుడ్ హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'జార్జ్ క్రిష్' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అయితే ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచేందుకు వస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్ర యూనిట్ అత్యంత భారీ సెట్లను నిర్మించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం అక్కడే ఒక అద్భుతమైన షెడ్యూల్‌ను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే హీరో శర్వానంద్‌పై ఒక అదిరిపోయే 'జార్జ్ క్రిష్' టైటిల్ సాంగ్‌ను గ్రాండ్‌గా షూట్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో శర్వానంద్ చాలా డిఫరెంట్‌గా జూనియర్ సైంటిస్ట్ పాత్రలో కనిపించబోతున్నారు. ఆయన క్యారెక్టర్ చుట్టూ నడిచే సన్నివేశాలు, వైట్ల మార్క్ కామెడీ టైమింగ్ సినిమాకే హైలైట్‌గా నిలవనున్నాయి. ఫుల్-లెంగ్త్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ఎన్నో హిలేరియస్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలాఉంటే, ఈ సినిమాలో శర్వానంద్ సరసన అందాల భామ మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి మధ్య వచ్చే లవ్ ట్రాక్ పూర్తిగా ట్రెండీగా, యూత్‌ను ఆకట్టుకునేలా వైవిధ్యమైన ఫన్ పాయింట్ ఆఫ్ వ్యూలో సాగుతుందని తెలుస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఈ సినిమాకు సంగీత సంచలనం అనూప్ రూబెన్స్ అద్భుతమైన బాణీలు అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ తో పాటు శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ తో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి మరి.


రజనీకాంత్ 'ధర్మన్'పై
భారీ అంచనాలు..

2027 సంక్రాంతి నుంచి వేసవికి వాయిదా?

సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ ఆసక్తి పెంచుతున్న చిత్రాల్లో 'ధర్మన్' ఒకటి. విభిన్న కథాంశాలతో సినిమాలు తెరకెక్కించే దర్శకుడు అశ్విత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విశ్వనటుడు కమల్ హాసన్ నిర్మాణ బాధ్యతలు చేపడుతున్న ఈ ప్రాజెక్టులో రామ్ పోతినేని, రాశీ ఖన్నా, సిమ్రాన్, యోగి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే షూటింగ్ ప్రారంభం కావడంతో ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. అయితే మొదట అనుకున్న విడుదల తేదీ విషయంలో మార్పులు జరిగే అవకాశం ఉందనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రజనీకాంత్ నటిస్తున్న సినిమాలంటే ప్రేక్షకుల్లో సహజంగానే భారీ అంచనాలు ఉంటాయి. ముఖ్యంగా 'జైలర్' విజయంతో ఆయన తదుపరి ప్రాజెక్టులపై అభిమానులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో 'జైలర్ 2' తర్వాత 'ధర్మన్' గురించి వస్తున్న వార్తలు ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. అయితే ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, కథ, విడుదల తేదీ వంటి వివరాలపై అధికారిక ప్రకటనల కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. దర్శకుడు అశ్విత్ మారిముత్తు గతంలో 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి చిత్రాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. వినోదంతో పాటు భిన్నమైన కథనాన్ని అందించే ప్రయత్నం ఆయన సినిమాల్లో కనిపిస్తుంది. అలాంటి దర్శకుడు ఈ భారీ ప్రాజెక్టును ఎలా రూపొందించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. రజనీకాంత్ పేరుతో ముడిపడిన ఈ చిత్రం గురించి వస్తున్న అంచనాలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి.

ఈ సినిమాకు కమల్ హాసన్ నిర్మాతగా వ్యవహరిస్తుండటం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. నటుడిగా ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న కమల్ హాసన్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్టు ఎలా ఉండబోతోందన్న ఆసక్తి నెలకొంది. భారీ తారాగణం, అనుభవజ్ఞులైన సాంకేతిక బృందం కలిసి పనిచేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నిర్మాణ విలువలపైనా అంచనాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం 'ధర్మన్' విడుదల తేదీపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ సినిమాను మొదట 2027 సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు విడుదల ప్రణాళికల్లో మార్పులు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.



'తులాభారం' టైటిల్
గ్లింప్స్ విడుదల



మాస్ మహారాజా రవితేజ, వైవిధ్యమైన సినిమాల దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక సరికొత్త అప్‌డేట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ సినిమాకు 'తులాభారం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ, చిత్ర బృందం ఒక ప్రత్యేకమైన టైటిల్ డాక్యుమెంటరీని విడుదల చేసింది. బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వివేక్ ఆత్రేయ తనదైన మార్క్ కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కిస్తుండగా, రాక్ స్టార్ వివేక్ సాగర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు. రవితేజ మార్క్ ఎనర్జీకి, వివేక్ ఆత్రేయ రాసే బలమైన పాత్రలు, కథనం తోడైతే ఈ సినిమా ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమా అనుభూతిని పంచుతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా విడుదల చేసిన 'తులాభారం' టైటిల్ డాక్యుమెంటరీ సినిమాపై ఉన్న క్యూరియాసిటీని మరింత పెంచేలా ఉంది. చిత్ర నిర్మాణం, బ్యాక్‌గ్రౌండ్ వర్క్‌కు సంబంధించిన విశేషాలను ఈ డాక్యుమెంటరీ ద్వారా పంచుకున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు, నటీనటుల వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ సినిమాలో ప్రియాంక మోహన్, అనాస్వరా రాజన్ కథానాయికులుగా నటిస్తుండగా.. జేడీ చక్రవర్తి, తరుణ్ భాస్కర్ కీలక పాత్రల్లో నటించబోతున్నారు.